క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: గద్వాల పట్టణంలో తెలుగుపేట కాలనీలోని గుడి వద్ద పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్, లూజ్‌గా ఉన్న విద్యుత్ లైన్లు సరి చేయనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30గంటల నుంచి 10.30గంటల వరకు పట్టణంలోని బీడీ కాలనీ, తెలుగుపేట, చిన్న అగ్రహారం, కుంటవీధి, తేరుమైదానం, చేపల మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

గట్టు: రైతుబంధు నిధులు మళ్లించిన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు శనివారం డీఏఓ గోవిందునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీం పాష, ఆంజనేయులు డీఏఓను కలిసి ఫిర్యాదు చేశారు. బల్గెర ఏఈఓగా పని చేసిన దివ్య 64 మంది రైతులకు సంబంధించిన సుమారుగా రూ.36 లక్షల రైతు బంధు నిధులు మళ్లించి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధిలో ఎంపీ కృషి మరువలేనిది

రాజోళి: నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని, ఆయన కృషిని మరువలేమని ఎంపీపీ మరియమ్మ అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం గతంలో పలుమార్లు కేంద్ర రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాధా మోహన్ సింగ్, మంత్రి అశ్విని వైష్ణవ్‌లను కలిసి నిధుల మంజూరు కోసం నిరంతరం శ్రమించారని, ఆయన చేసిన కృషితోనే ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు. దీంతో గద్వాల రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో నతానియేల్, రామకృష్ణ, పరుశ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

గద్వాల అర్బన్: డిగ్రీ విద్యతో పాటు పోటీ పరీక్షలపై కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. ఇండియన్ అకాడమి ఫర్ కాంపిటెటివ్ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఎంఏఎల్‌డీ డిగ్రీ, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు పోటీ పరీక్షలు, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. డిగ్రీ పూర్తయినా తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ వకాశాలపై దృష్టి సారించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

చిన్నారులకు విద్యాసామగ్రి అందజేత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలసదనంలో శనివారం పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య చిన్నారులకు విద్యాసామగ్రి అందజేశారు. చిన్నారులకు డిక్షనరీ, బుక్స్, డైనింగ్ టేబుల్స్, షూ, పెన్నులు, పెన్సిళ్లతో పాటు పండ్లను పంపిణీ చేశారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్ రఫిక్, బాలసదనం సూపరింటెండెంట్ సుధారాణి ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

అయిజ: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కా ర్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. అయిజ మండలం జనాభాలో, విస్తీర్ణంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే పెద్దదని, జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండో అతి పెద్ద పట్టణమన్నారు. ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటాద్రిరెడ్డి, జలగరి అశోక్, తిరుమలరెడ్డి, మాదన్న, శేఖర్, నరసింహయ్యశెట్టి పాల్గొన్నారు.

26న కబడ్డీ పోటీలు

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26, 27 తేదీల్లో అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు కమిటీ నిబంధనల మేరకు నడుచుకోవాలని తెలిపారు.

ఎంపీ సీటు సంపత్‌కు ఇవ్వాలి

అలంపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సీటును ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వేముల శ్యామ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానంలో ఉన్న ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు సంపత్ కుమార్‌కు సీటు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అధిష్టానం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో గెలవడానికి అవకాశం ఉన్న సంపత్ కుమార్‌ను గుర్తించి టికెట్ కేటాయించాలని కోరారు.

కనుల పండువగా రథోత్సవం


కంచుపాడు రేణుక ఎల్లమ్మ అమ్మవారు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


కంచుపాడులో బండలాగుతున్న వృషభరాజులు

ఉండవెల్లి: ఎల్లమ్మ తల్లి..దీవించమ్మ అంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని కంచుపాడులో భారతాల పున్నమి సందర్భంగా శనివారం రేణుక ఎల్లమ్మ(జములమ్మ) అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు. అమ్మవారికి ఎమ్మెల్యే విజేయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తక్కశిలకు చెందిన మల్లికార్జున అతని కుటుంబ సభ్యులు ఆలయానికి రూ.20వేల విలువైన త్రిశులాన్ని అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు..

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో రేణుక ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా వృషభరాజులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. దాదాపు 20 జతలు రాగా, 15 జతలు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చెన్నకేశవస్వామి తేరు..

మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో రాత్రి కల్యాణం నిర్వహించారు. పున్నమి సందర్భంగా తేరును, గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి స్వామి వారి విగ్రహాలను ఘనంగా శివ స్వాములు ఊరేగించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం


అలంపూర్ మున్సిపాలిటీలో సీసీ రోడ్డు భూమి పూజలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అలంపూర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని అంబేద్కర్ కాలనీలోని హరినవాడలో, పోస్టుఆఫీస్ కాలనీ వరకు రూ.70లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వారు అక్కడి కాలనీ వాసులతో మాట్లాడారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. మున్సిపాలిటీకి పలువురు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్ విజయవంతం


క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు విజయవంతం అయ్యాయి. ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. 8, 9, 10 తరగతుల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున పాల్గొన్నారు. అదేవిధంగా క్విజ్ పోటీల్లో సీవీరామన్ గ్రూప్ ప్రథమ బహుమతి, ఐన్‌స్టీన్ గ్రూప్ ద్వితీయ బహుమతి, జగదీష్ చంద్రబోస్ గ్రూప్ తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి.

జములమ్మ ఉత్సవాలు


జములమ్మ అమ్మవారు

అలంపూర్: అలంపూర్ మండలంలోని కోనేరులో వెలిసిన జములమ్మ గ్రామ దేవత ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది బార్తల పౌర్ణమి నుంచి ఉత్సవాలు ఆరంభమై ఏరువాక పౌర్ణమి వరకు కొనసాగుతాయని గ్రామస్తులు తెలిపారు. బార్తల పౌర్ణమిని పురస్కరించుకొని వివిధ గ్రామాల భక్తులు జములమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు నాలుగు నెలలపాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి భారీగా తరలి వస్తారు.

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో అభిషేకం, హోమం నిర్వహించారు. రాత్రి స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజాపురంలో రాత్రి గుంటి రంగనాథస్వామి రథోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉప్పలలో జమదగ్ని, జంబులేశ్వరి ఆలయంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి భజన పోటీలు నిర్వహించారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, కృష్ణ ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


అల్వలపాడులో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అలంపూర్: విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధన చేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా సందీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శైలేష్, ఉపాధ్యాయులుగా జెస్సీ, నందిని ప్రీతి, సుధ, శృతి, అక్షర, ఇంతియాజ్, వంశీ, విజయ్, సతీష్, మహేష్‌లు, నవీన్, శ్రీనులు వ్యవహరించారు. ఎంఈఓ అశోక్ కుమార్, పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు భారతి, నజీమా, తబ్బుమ్, ఆదాంబీ, పద్మనాభరెడ్డి, బషీర్, రాజశేఖర్ ఉన్నారు.

ధరూరు: విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని అల్వలపాడులోని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా నాగరాజు, డీఈఓగా శ్రీకాంత్, ఎంఈఓగా యువరాజ్, హెచ్ఎంగా విష్ణు, పీఈటీగా నాగేష్ తదితరులు పాత్రలు పోషించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరిత, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, గీతామణి, శేక్షావలి, ఫాతిమా పాల్గొన్నారు.

స్టేజ్ ఫియర్ లేకుండా చూసుకోవాలి

శాంతినగర్: విద్యార్థి దశనుంచే స్టేజ్ ఫియర్ లేకుండా చూసుకోవాలని ఎంఈఓ నరసింహులు అన్నారు. వడ్డేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం ప్రధానోపాధ్యాయులు శ్యామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ హాజరై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేషన్, సురేష్, అజయకుమారి, జావీద్, దావీదు, జనార్దన్, చెన్నారెడ్డి, శేషమ్మ, కల్యాణి, నాగజ్యోతి, రూపాబాయి, శ్రావణి, సీఆర్‌పీ నాగేష్, సరిత పాల్గొన్నారు.


వడ్డేపల్లిలో..

డీఎస్పీని సన్మానించిన ప్రజాప్రతినిధులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు గద్వాల నూతన డీఎస్పీ సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇటిక్యాల జెడ్పీటీసీ హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో బండలాగుడు పోటీలు నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బండలాగుడు పోటీలలో జంతువులను హింసిస్తున్న తరుణంలో లీగల్ కేసులో భాగంగా సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మద్దిలేటి, మాల చిన్న నరసింహులు, చందు యాదవ్, బాలస్వామి, రవికుమార్ రెడ్డి, కృష్ణగౌడు, తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ప్రింటర్స్ డే

అయిజ: మండల కేంద్రంలో శనివారం ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కార్మికులు ప్రింటర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1439 ఫిబ్రవరి 24న గూటెన్‌బర్గ్ అనే మహానుభావుడు అక్షరాన్ని కనుగొని ప్రింటింగ్‌ను సృష్టించాడని అన్నారు. ఆ మహానుభావుని జన్మదినాన్ని ప్రింటర్స్‌డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజిబాబు, మహేశ్వర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మారెప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహిళా అధ్యక్షురాలిగా సరస్వతి

మానవపాడు: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు నాగశిరోమణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలిగా సరస్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, టెంపుల్ మాజీ చైర్మన్ మద్దిలేటి, ప్రభాకర్, తలారి వెంకటన్న, శేఖర్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత

గట్టు: చిన్నోనిపల్లె దగ్గర గుట్టుగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి మట్టిని మరో చోటుకు తరలిస్తున్న క్రమంలో గద్వాలకు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి పట్టుకుంది. దాదాపుగా 8 ట్రాక్టర్లు మట్టిని అక్రమంగా మరో చోటుకు రాత్రి వేళలో తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గుడిసె దగ్ధం

రాజోళి: మండలంలోని పెద్ద తాండ్రపాడులో గుడిసె దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ వేణు గుడిసెలో దీపం వెలిగించి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు దీపం మంట గుడిసెకు అంటుకుని గుడిసె మొత్తం తగలబడింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న టీవీ. నిత్యవసర వస్తువులు, బియ్యం, బట్టలు కాలిపోయాయి.

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల అర్బన్: మహిళలు, అమ్మాయిలు సఖి సెంటర్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ టాటా బాబు, డీసీపీఓ నర్సింహ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో సఖి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళల భద్రతే సఖి లక్ష్యమన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు తదితర వాటిని ఎదుర్కొనే మహిళలు, అమ్మాయిల రక్షణ, న్యాయ, వైద్య, తాత్కాలిక సేవలను సఖి కేంద్రం ద్వారా అందిచనున్నట్లు తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళలు 181 నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సఖి సీఏ కవిత, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విజయుడు


ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని సంత మార్కెట్ కాలనీకి చెందిన సుజాతమ్మ అనారోగ్యం వల్ల చికిత్స కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల ఎల్ఓసీని ఆమె కుమారుడు బద్రికి ఎమ్మెల్యే అందజేశారు. మత్స్యశాఖ శాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, నాయకులు రఘురెడ్డి ఉన్నారు.

ఎంపీడీఓ, తహసీల్దార్లకు సన్మానం


తహసీల్దార్ వెంకట్రావును సన్మానిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి నౌషద్

ధరూరు: ఇటీవల బాధ్యతలు చేపట్టిన మండల అధికారులను రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండల ఎంపీడీఓ మంజుల, తహసీల్దార్ వెంకటరావులు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ మండల కార్యదర్శి నౌషద్, షాకీర్, మోయిన్, ముత్తు, సూరి, వెంకట్‌లు శాలువా, పూలమాలలతో వారిని ఘనంగా సన్మానించారు.

నందిన్నె పాఠశాలలో వీడ్కోలు


నందిన్నెలోని విద్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదివి మంచి ఫలితాలు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్యానాయక్, ఉపాధ్యాయులు నరసింహ, కృష్ణయ్య, రాధికబాయి, వీరేష్, జయరాజ్, సువర్ణ, లత, లక్ష్మణ్, మురళి, అమరేష్‌బాబు, రేణుక, వెంకట్రాములు, విద్యార్థులు ఉన్నారు.

ఉద్యోగం సాధించిన కృష్ణకు అభినందనలు


తెలుగుకృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గట్టు: పుట్టుకతో అంధుడైన గట్టుకు చెందిన తెలుగు కృష్ణ కష్టపడి గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో శనివారం ఆయనను తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ సన్మానించారు. అంధత్వాన్ని జయించి, పీజీటీగా ఉద్యోగం సంపాదించిన తెలుగు కృష్ణ అందరికి ఆదర్శంగా నిలిచినట్లు ఆయన తెలిపారు. తెలుగు కృష్ణతో పాటుగా తండ్రి తెలుగు ప్యాట్ల నర్సన్నను ఆయన నివాసంలో కలుసుకుని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజుసాగర్, జిన్నా, నర్సింహులుగౌడు, నర్సింహులు, వీరేంద్రసాగర్‌తొ పాటుగా మాజీ వార్డు సభ్యుడు కమ్మరి రమేష్ పాల్గొన్నారు.

ఓటర్ నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వాహిదా ఖాతున్

మానవపాడు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ వాహిద ఖాతున్ ఆధ్వర్యంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటర్ నమోదు చేసుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరణించిన, గ్రామాల్లో ఓటర్‌లిస్టులో డబుల్ పేరు ఉన్న తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా అప్డేట్ ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధరణిసా, బీఎల్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరగాలె'


మాట్లాడుతున్న బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు

అలంపూర్: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరగాలని బీఎస్పీ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి ఎంసీ కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పవీణ్ కుమార్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. ఈ నెల 26న జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణంలో మైనార్టీ సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు మహేస్, కందికంటి విజయ్ కుమార్, రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

గద్వాల అర్బన్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు, జిల్లా అధ్యక్షుడు అతిఖుర్ రహ్మాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు కందికంటి విజయ్‌కుమార్, మణికుమార్, గోపాల్ రెడ్డి, ముని, సవారన్న ఉన్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఏఓ అయూబ్

ఎర్రవల్లిచౌరస్తా: పెస్టిసైడ్ షాపుల్లో అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి అయూబ్ సూచించారు. శనివారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం రైతు వేదికలో మండలంలోని పెస్టిసైడ్ డీలర్లకు ఓఎల్ఎంఎస్‌పై ప్రత్యేక శిక్షణ నిర్వహించి పలు అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ప్రతి డీలర్ తప్పకుండా తమ లైసెన్స్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కేవలం ప్రభుత్వ అనుమతులున్న మందులను మాత్రమే షాపులలో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు, పెస్టిసైడ్స్ డీలర్లు ఉన్నారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించండి

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు పశువులకు వ్యాక్సిన్ వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మొదటిసారిగా పశువులకు థైలెరియోసిస్ వ్యాక్సిన్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. థైలెరియా వ్యాక్సిన్ థైలెరియోసిస్ అను టిక్‌బోర్న్ వ్యాధులను నివారిస్తుందన్నారు. వివరాలు తెలియజేయాలని వెటర్నరీ అసిస్టెంట్ సూచించారు.